క్లుప్తంగా

గోదావరి గట్టు రెయిలింగ్ ధ్వంసం


గోదావరిగట్టు వెంబడి రెయిలింగ్ ధ్వంసమైన దృశ్యం

నరసాపురం: పట్టణంలో గోదావరిగట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గట్టు వెంబడి రెయిలింగ్ నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమయ్యింది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమవడంతో అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా

పోడూరు: జిన్నూరు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి అప్పాజీ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. 4 నెలల కిందటే ఆయన సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా లేఖను భీమవరం కోఆపరేటివ్ డీఆర్‌కు అందజేసినట్లు ఆయన విలేకర్లకు తెలిపారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ పదవికి డీటీడీసీ బాబు రాజీనామా


డీటీడీసీ బాబు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు) సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు పాలకొల్లు ఏఎంసీ కార్యదర్శికి తన రాజీనామా లేఖను అందజేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. గత 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు.

దుర్గాలక్ష్మణేశ్వరుడికి ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం దుర్గాలక్ష్మణేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కావడంతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు యలమంచిలి ప్రసాదశర్మ నేతృత్వంలో ప్రజా క్షేమం కోరుతూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో చాగంటి సురేష్, సిబ్బంది, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పసలదీవిలో శ్రీరామ సప్తాహం


పసలదీవి రామాలయంలో పూజలు చేస్తున్న దంపతులు

నరసాపురం రూరల్: మండలంలోని పసలదీవి రామాలయంలో శ్రీరామ సప్తాహం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా నిరంతరాయంగా శ్రీరామ నామాన్ని జపిస్తూ కీర్తనలు, భజనలు చేయడంతో గ్రామం రామ నామ సంకీర్తనలతో హోరెత్తింది. ప్రతీరోజూ ఉదయం సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైబడి గ్రామంలో నిరంతరాయంగా సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సప్తాహ కార్యక్రమం ముగింపు సందర్భంగా 14న పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ రాంబాబు

అత్తిలి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అత్తిలి ఎస్ఐ వి రాంబాబు చెప్పారు. సోమవారం అత్తిలిలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ఎస్ఐ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, భూతాపాన్ని తగ్గించడానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలి


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అందే సూర్యావతి

మొగల్తూరు: పార్టీలు వేరైనా సభ్యులందరూ కలిసి గ్రామాభివృద్ధి సహకరించుకోవాలని ఎంపీపీ అందే సూర్యావతి సూచించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకునేలా సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో శామ్యూల్ జాన్ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అవసరమైన 46,150 పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పంపించగా ఇప్పటి వరకు సుమారు 20 వేల పుస్తకాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా మొగల్తూరు ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా తీర్మానం చేయాలని ప్రతిపాదించారు. వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ దాళ్వా సాగుకు అధికారులు 3505 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించగా 3498 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. సార్వా సాగుకు ముందుగా నారు మడులు వేసుకోవాలని రైతులకు సూచిస్తున్నామన్నారు. 150 రోజులకు దిగుబడి వచ్చే ఎంటీయు 1061, 1064, 1318, పీఎల్ 1100 రకాల విత్తనాలను వినియోగించాలని సూచించామన్నారు. మొగల్తూరు మండలంలో సుమారు 1398 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. రైతులకు అవసరమయ్యే విత్తనాలను రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం..

ఈనాడు, ఈటీవి అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీడీవో వి.బాబ్జిరాజు, తహసీల్దార్ భాస్కర్, నాయకులు అందే భుజంగరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దగ్గులూరులో ప్రత్యేక వైద్య శిబిరం


దగ్గులూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డా.అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. దగ్గులూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డా.ప్రతాప్ కుమార్ రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు అందించారు. శిబిరంలో పరీక్షలు చేయించుకోవడం వలన తక్షణమే వైద్య సేవలు అందించొచ్చని సూచించారు. గర్భిణీలు, బాలింతలను పరీక్షించారు. కిషోర బాలికలను పరీక్షించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత వల్ల పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. శిబిరంలో షుగర్, బీపీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో 150 మందిని పరీక్షించారు. హెచ్‌వీ పీ.ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ యన్నపు లిఖిప్రియ, ఏఎన్ఎం ఎం.మార్తమ్మ, ఎంపీహెచ్‌ఏ ఎం.దివాకర్‌బాబు, ఆశ వర్కర్లు కే.మంగమ్మ, కే.పుష్పకుమారి, తదితరులు పాల్గొని వైద్య సేవలందించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు

పోడూరు: వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు సూచించిన సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ సుమంగళి సాగర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. మండల పరిషత్ సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ ఆయా శాఖల పని తీరును వివరించారు. సమావేశంలో ఎంపీడీవో డి.సుహాసిని, తహసీల్దార్ ఎం.మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఆర్ఐ కె.రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంతోనే సమానత్వం


ఇంటింటికీ ధర్మ ప్రచారం కర పత్రాలను పంచుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: సనాతన ధర్మాన్ని ఆచరించడం ద్వారా మానవ జీవితంలో అసమానతలను తొలగించి, సమానత్వం సాధించవొచ్చని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ మన్నే కుమారస్వామి అన్నారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని ప్రజలకు వివరించడానికి ఇంటింటికీ ధర్మ ప్రచారం కార్యక్రమం సోమవారం యలమంచిలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఉన్న కులాల ఆవిర్భావం, వాటి విశిష్టత, కులవృత్తుల గురించి అవగాహన కల్పించడమే ఈ ధర్మ ప్రచార ప్రధాన ధ్యేయమన్నారు. వృత్తుల ఆధారంగా కులాలను ఏర్పరచారే కానీ మానవులంతా సమానమేనని సనాతన ధర్మం చెబుతోందన్నారు. దానిని వక్రీకరించి నేడు మానవులు కులాలుగా విడిపోయి తగాదాలు పడుతున్నారన్నారు. సమాజంలో మనుషులు కలిసి జీవించాలంటే సనాతన ధర్మాన్ని ఆచరించడమే ఉత్తమ మార్గమన్నారు. గ్రామ ధార్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హిందువులు విజయవంతం చేయాలని కుమారస్వామి కోరారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు గ్రామంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం కర పత్రాలను పంపిణీ చేశారు.

వెలగని వీధి దీపాలు

నరసాపురం: పట్టణంలోని స్టేషన్‌పేట, చినమామిడిపల్లి ప్రాంతాల్లో నాలుగు రోజులుగా వీధి దీపాలు సవ్యంగా వెలగడం లేదు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వీధి దీపాలు వెలగకపోవడంతో భయంభయంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విధ్వంసాలకు పాల్పడొద్దు


వైట్ల కిషోర్

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన మరుక్షణం నుంచి టీడీపీ కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్ ఓ ప్రకటనలో అన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయాలు, మహానేత వైఎస్సార్ విగ్రహాలపై దాడులు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో జయాపజయాలు సర్వసాధారణమన్నారు. గెలిచిన పార్టీ గతం కంటే మరింత అభివృద్ధి చేయడంలో పోటీ పడాలే తప్ప విధ్వంసకర పరిస్థితులు కల్పించి, శాంతి భద్రతలకు విఘాతం కల్గించకూడదన్నారు. ఇటువంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయన్నారు. ప్రజలు తిరగబడే రోజులు వస్తాయన్నారు. అందుకొన్న విజయాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి సాధించాలని హితవు పలికారు.

ఆక్రమణల తొలగింపు


పాలకొల్లు పూలపల్లి బైపాస్ రోడ్డు పక్క ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

పాలకొల్లు అర్బన్: రూరల్ పంచాయతీ పరిధిలోని పూలపల్లి బైపాస్‌రోడ్డులో వంతెనను ఆనుకుని రోడ్డు పక్క స్థలాలు పలువురు ఆక్రమించుకొని పందిళ్లు వేసి, చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. కొబ్బరి బోండాలు, టిఫిన్ సెంటర్లు, బజ్జీ బళ్లు, పండ్లు, జ్యూస్ వ్యాపారాలు చేసుకొని పలువురు ఉపాధి పొందుతున్నారు. ప్రతీ రోజు సాయంత్రం, అలాగే ఉదయం సమయాల్లో హైదరాబాద్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇక్కడ నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలుగుతోందని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. తాత్కాలిక షెడ్డులు వేయడంతో ట్రాఫిక్‌కి మరీ ఇబ్బందిగా మారింది. అలాగే కొంతమంది ఈ షెడ్డులను అద్దెకిచ్చుని దందా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై పాలకొల్లు రూరల్ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈవోపీఆర్‌డీ కేఎం.వైభవతి పర్యవేక్షణలో కార్యదర్శి పవన్, పంచాయతీ గుమస్తా రాంబాబులు సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. పంచాయతీ సిబ్బంది తాత్కాలిక షెడ్డులను తొలగించారు. కొబ్బరి ఆకులు, కర్రలు ఆక్రమణదారులకు అప్పగించి ఇకపై షెడ్డులు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు పక్క చిరు వ్యాపారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న తమపై అధికారులు చర్యలు తీసుకోవడం దారుణమని చిరువ్యాపారులు వాపోతున్నారు.

డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ జువాలజీ, బిఎస్సీ ఎంపీసీఎస్, బీకామ్ కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పై కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే తీసుకుంటారని తెలిపారు. అర్హులైన విద్యార్థినులకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందిస్తారని తెలిపారు. కళాశాలలో రక్షిత మంచి నీరు, అధునాతన వాష్ రూమ్స్, డిజిటల్ విద్యా బోధన, డిజిటల్ లైబ్రరీ, సెమినార్ హాల్, లేబరేటరీ, గ్రీన్‌హౌస్ వంటి వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిగ్రీ అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థినులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్, ఇంటర్మీడియట్ మార్కుల లిస్టు, టీసీ మరియు పదో తరగతి మార్కుల లిస్టు ఒరిజినల్, ఫోటోస్టాట్ కాపీలను తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 6302194657, 7406547372 లలో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పెంకుళ్లపాడు రోడ్డులో అడబాల గార్డెన్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగిపాముల నారాయణరావు (68) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం స్థానిక ఎల్అండ్‌టీ సముదాయంలో నివాసం ఉంటున్న మృతుడు నారాయణరావు ఎలక్ట్రీషియన్ పని చేసేవాడు. ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 7న పనిపై పట్టణానికి సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి ఇంటికి వస్తుండగా అడబాల గార్డెన్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో నారాయణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి నారాయణరావును పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తణుకు తరలించారు. అక్కడి నుంచి ఏలూరు జీజీహెచ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


సిద్ధాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో విక్టర్

పెనుగొండ: పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా సోమవారం సిద్ధాంతంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామాలలో ఎక్కడ చెత్త లేకుండా డంపింగ్ కేంద్రాలకు తరలించాలని, మురుగు సమస్య ఉండకూడదని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో ప్రజలు పంచాయతీ అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమం సోమవారం నుంచి ఐదు రోజులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వీఎస్ఎస్. శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్. శ్రీనివాస్ దొర, ఈవోపీఆర్‌డీ సీహెచ్‌వీ.రెడ్డి, గ్రామ కార్యదర్శి నరసింహమూర్తి సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మానవత అంబులెన్స్ సేవలు


భీమవరం పట్టణంలో తాడేరు రోడ్డు వద్ద అంబులెన్స్ ఉపయోగాలను వివరిస్తున్న దృశ్యం

భీమవరం: మానవత సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానవత అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతిరాజు అన్నారు. సంవత్సర కాలంగా సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నూతనంగా భూపతిరాజు సత్యనారాయణరాజు సంస్థకు అందించిన అంబులెన్స్ పేద ప్రజలకు నేటి నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. భీమవరం పట్టణ పరిధిలో కేవలం రూ.300లకే సేవలందిస్తున్నామని, నామమాత్రపు రుసుము చెల్లించలేని పేదలకు ఉచితంగా అందుబాటులో ఉంటుందన్నారు. దూర ప్రాంతాలకు తక్కువ చార్జీతో అందుబాటులో ఉంటుందని అంబులెన్స్‌తోపాటు మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్ కూడా ఉచితంగా అందిస్తున్నామని వెంకటపతిరాజు చెప్పారు. అనంతరం తాడేరు రోడ్డులో అంబులెన్స్ ఉపయోగాలను అక్కడి ప్రజలకు వివరించారు. అంబులెన్స్ అవసరానికి 94943 38086, 98661, 00987 సెల్ నంబర్స్‌కు సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, చింతాడ శ్రీనివాస్, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవాలు


ఉండిలో హనుమాన్ జయంతి వేడుక ముగింపులో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక పంచముఖ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకల ముగింపు సందర్భంగా అన్నసమారధన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి నిర్విరామంగా హనుమాన్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ సంవత్సరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నసమారధన వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలిపూడి, చెరుకువాడ, అర్తమూరు, పాములపర్రు, కోలమూరు, ఎన్నార్పీ అగ్రహారం, వాండ్రం, మహదేవపట్నం తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



విస్సాకోడేరులో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య అధికారులు

పాలకోడేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని ఎంపీహెచ్‌వో ప్రభాకర్ సూచించారు. పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి రంగమ నాయుడు ఆదేశానుసారం జూన్‌లో నిర్వహించే యాంటి మలేరియా కార్యక్రమంలో భాగంగా విస్సాకోడేరులోని ఏఎస్ఆర్ నగర్‌లో కనకదుర్గ దేవాలయం వద్ద పరిసరాలను పరిశుభ్రత, వ్యాధుల పట్ల అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నాగమణమ్మ, ఎం ఎల్‌హెచ్‌పీలు లలిత, వాణి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ భూమి లీజు వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడిలో వేంచేసి యున్న పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానం హక్కు భుక్తంలో ఉన్న 87.71 ఎకరాల వ్యవసాయ భూమికి 2024-2025 నుంచి 2026-2027 వరకూ 3 సంవత్సరాల కాల పరిమితికి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించగా, 34.92 ఎకరాలు బహిరంగ వేలంలో లీజుకు ఇచ్చామని ఆలయ ఈవో డి.కృష్ణంరాజు తెలిపారు. గతంలో రూ.10,50,000 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.10,72,000 ఆదాయం వచ్చిందని గతంలో కంటే రూ.22,000 ఆదాయం పెరిగిందని తెలిపారు.

దండగర్ర జెడ్పీహెచ్ఎస్ పీడీకి ప్రశంసా పత్రం అందజేత


ప్రశంసా పత్రం అందుకుంటున్న పీడీ చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కే.పద్మరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని సోమవారం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న యోగాసన పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించేందుకు ఈ ప్రశంసా పత్రం లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడుగు చంద్రశేఖర్‌ను ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యాకమిటి సభ్యులు అభినందించారు.

రేపు కేజీఆర్ఎల్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

భీమవరం: పట్టణంలోని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 12న దివీస్ ఫార్మా ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, హైద్రాబాద్ సమీపంలో ఉన్న బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పని చేయడానికి క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌లో బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన విద్యార్థులు అర్హులన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో కేవలం పురుషులకు మాత్రమే అవకాశముందని నాగేశ్వరరావు పేర్కొన్నారు.

తాడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ రాజీనామా

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సోమవారం రాజీనామా చేశారు. త్రిసభ్య కమిటీ చెర్మన్‌గా కొట్టు త్రినాథ్, సభ్యులుగా కోమటి రాంబాబు, బుంగా ప్రహ్లాదుడు ఇప్పటి వరకు సొసైటీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాజీనామా చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు తెలిపారు. రాజీనామా పత్రాలను సొసైటీ కార్యదర్శి నందమూరి సుబ్బారావుకు అందజేశారు.